## కన్నాల లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బెల్లంపల్లిరూరల్, మే 14: బెల్లంపల్లి కన్నాల గ్రామ శివారులో గల మంద లచ్చయ్యకు చెందిన బీడు భూమిలో మంగళవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు తాళ్లగురిజాల ఏఎస్ఐ రాజన్న తెలిపారు. కన్నాల గ్రామపంచాయతీ కార్యదర్శి బొర్లకుంట శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతుడి శరీరాన్ని గుర్తు పట్టేందుకు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతుడి సంబంధికులుంటే తాళ్లగురిజాల పోలీసులకు సమాచారమందించాలని తెలిపారు.

## కృష్ణమందిర్ 50వ వార్షికోత్సవ వేడుకలు

బెల్లంపల్లి, మే 14 : పట్టణంలోని కృష్ణ మందిర్ 50వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు దామోదరాచార్యులు, ఆలయ పూజారి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా

- ముగ్గురికి గాయాలు



తలకు గాయమైన గోలేటి జనాబాయి

బెజ్జూర్, మే 14 : మండలంలోని నాగెపల్లి సమీపంలో మంగళవారం ఆటో బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కుశ్నపల్లి, ఎల్కపల్లి గ్రామాలకు చెందిన ప్రయాణికులు మహారాష్ట్రకు వెళ్లి ఆటోలో వారి స్వగ్రామానికి వస్తున్నారు. బెజ్జూర్ మండలంలోని కోయపల్లి, నాగెపల్లి గ్రామాల మధ్య ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ఎల్కపల్లి గ్రామానికి చెందిన గోలేటి జనాబాయికి తలకు తీవ్రగాయమైంది. ఆటో డ్రైవర్ సోనాబాల, హరీశ్ బాలకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
RECRUITMENT
★Pen, Pencil Company, Educated, Unemployed Girls/Boys, Male/Female, House Wife Earn 24500-64500 Packing Work at Home 9034548725, 9728230253
NT-3277

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

# అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో..

- ఎవరి గెలుపు ధీమాలో వారే..
- ప్రధాన పార్టీల అభ్యర్థులపై ప్రజల్లో చర్చలు

### మూడు మిషన్లు.. ముప్పైఆరు అనుమానాలు

- ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఉత్కంఠ

తాండూర్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల్లో మూడు ఈవీఎం మిషన్లతో నిర్వహించిన పోలింగ్‌తో ఇటు అభ్యర్థులు, అటు ప్రజల్లో ఉత్కంఠ నెలకొన్నది. ప్రధాన పార్టీల నాయకుల్లో గుబులు చోటు చేసుకున్నది. ఈ ఎన్నికల్లో 47 మంది అభ్యర్థులు బరిలో నిలవగా ప్రతి పోలింగ్ కేంద్రంలో మూడు ఈవీఎం మిషన్లు ఏర్పాటు చేశారు. హోరాహోరీగా తలపడుతున్న మూడు ప్రధాన పార్టీల అభ్యర్థుల గుర్తులు కూడా మొదటి మిషన్‌లోనే ఉన్నాయి. నంబర్లు, అక్షరాలు కూడ తెలియని అక్షరజ్ఞానం లేని ఓటర్లు ఫొటోను చూసి ఓటు వేశారో లేదోనని ప్రధాన పార్టీల అభ్యర్థులకు అంతకుచిక్కకుండా ఉన్నది.



తాండూర్‌లో పోలింగ్ కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు

తాండూర్, మే 14 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సోమవారం జరిగిన ఎన్నికల్లో పెద్దపల్లి నియోజకవర్గంలో పోటీ చేసిన వివిధ పార్టీల, స్వతంత్ర అభ్యర్థుల రాజకీయ భవిష్యత్ ఈవీఎం పెట్టెలలో భద్రంగా ఉంది. ముఖ్యంగా ప్రముఖ నాయకులు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ విజయం కోసం అహర్నిషలు కృషి చేశారు. ఎస్సీలకు రిజర్వు చేయబడిన పెద్దపల్లి నియోజకవర్గం ఎన్నికల ఫలితం ఎలా ఉండగలదోనని జిల్లా వ్యాప్తంగా చర్చలు జోరుగా జరుగుతున్నాయి. కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్), గడ్డం వంశీకృష్ణ (కాంగ్రెస్), గోమాస శ్రీనివాస్ బీజేపీ)తో పాటు మరి కొంత మంది పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు పోటీలో నిలిచారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఏడు నియోజకవర్గాల ఓటర్ల నాడి ఏ విధంగా ఉంటుందో ఏమాత్రం అంతు చిక్కని స్థితిలో ఉన్నది. తాము ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరణ చూపుతున్నారని భావిస్తున్న అభ్యర్థులంతా విజయంపై విశ్వాసంతో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, కాంగ్రెస్ మోసపూరిత వాగ్ధానాలు, వాటి విఫలమే కచ్చితంగా విజయలక్ష్మి వరించగలదనే విశ్వాసంతో ఉన్నారు. ఆరు గ్యారెంటీలు గెలిపిస్తాయని కాంగ్రెస్ ధీమాతో ఉంది. రామ మందిర నిర్మాణం, రాముడి అక్షింతలు, మోడీ పదేళ్ల పాలననే తమను విజయతీరాలకు తీసుకెళ్లిందని బీజేపీ గెలుపు ధీమాతో ఉంది.

**తాండూర్ మండలంలో 69.08 శాతం పోలింగ్**

తాండూర్ మండలంలోని మొత్తం 37 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 69.08 శాతం పోలింగ్ నమోదైంది. ఓటర్లు 27,209 కాగా 18,797 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా బెజ్జాల గ్రామంలో 134వ బూత్‌లో 326 మందికి గాను 278 ఓటేయగా 85.28 శాతం పోలింగ్ నమోదైంది. అత్యల్పంగా మాదారం 132వ బూత్‌లో 1148 మందికి గాను 591 మంది ఓటేయగా 51.48 శాతం పోలింగ్ నమోదైంది. బోయపల్లిలో 111 బూత్‌లో 742 ఓట్లకు గాను 551 ఓట్లు పోలవగా 74.26 శాతం, 112లో 620 గాను 453-73.06 శాతం, చౌటపల్లిలో 113లో 685 గాను 509- 74.31 శాతం, ద్వారకాపూర్‌లో 114లో 439 గాను 368-83.83 శాతం, చంద్రపల్లిలో 115లో 470 గాను 373-79.36 శాతం, కాసిపేట 116లో 776 గాను 566-72.94 శాతం, కాసిపేట 117లో 687 గాను 511- 74.38 శాతం, తంగళ్లపల్లి 118లో 1,056 గాను 693-65.63 శాతం, తంగళ్లపల్లి 119లో 818 గాను 544-66.50 శాతం, తంగల్లపల్లి 120లో 790 గాను 517-65.44 శాతం, తాండూర్ ఐబీ 121లో 710 గాను 514-72.39 శాతం, తాండూర్ ఐబీ 122లో 763 గాను 536-70.25 శాతం, తాండూర్ ఐబీ 123లో 960 గాను 663- 69.06 శాతం, తాండూర్ ఐబీ 124లో 969 గాను 620-63.98 శాతం, తాండూర్ ఐబీ 125లో 928 గాను 530-57.11 శాతం, తాండూర్ 126లో 987 గాను 656-66.46, తాండూర్ 127లో 1,134లో 792-69.84 శాతం, కిష్టంపేట్ 128లో 724 గాను 442-61.05 శాతం, కిష్టంపేట్ 129లో 669 గాను 435-65.02 శాతం, గోపాల్ నగర్ 130లో 422 గాను 334-79.15 శాతం, మాదారం 131లో 842 గాను 516-61.28 శాతం, మాదారం 132లో 1148 గాను 591-51.48 శాతం, మాదారం 133లో 640 గాను 375-58.59 శాతం, బెజ్జాల 134లో 326 గాను 278-85.28 శాతం, నర్సాపూర్ 135లో 450 గాను 382-84.89 శాతం, కొత్తపల్లి 136లో 724 గాను 562-77.62 శాతం, రాజీవ్‌నగర్ 137లో 781 గాను 550-70.42 శాతం, రేపల్లెవాడ 138లో 860 గాను 501-58.26 శాతం, రేచిని, బారెపల్లి, గజ్జలపల్లి 139లో 697 గాను 520-74.61 శాతం, రేచిని 140లో 665 గాను 425-63.91 శాతం, రేచిని 141లో 905 గాను 566-62.54 శాతం, రేచిని 142లో 565 గాను 376-66.55 శాతం, అన్నారం 143లో 260 గాను 213-81.92 శాతం, గంపలపల్లి 144లో 347 గాను 276-79.54 శాతం, అచ్చలాపూర్ 145లో 943 గాను 730-77.41 శాతం, అచ్చలాపూర్ 146లో 996 గాను 782-78.51 శాతం, అచ్చలాపూర్ 147లో 711 గాను 547-76.93 శాతం ఓట్లు నమోదయ్యాయి.

**కోటపల్లి మండలంలో 77 శాతం పోలింగ్ నమోదు**

కోటపల్లి, మే 14 : కోటపల్లి మండలంలో మొత్తం 26017 మంది ఓటర్లు ఉండగా 20090 మంది ఓటర్లు వారి ఓటు హక్కును వినియోగించుకోవడంతో 77 శాతం ఓటింగ్ నమోదైంది. ఎసన్వాయి గ్రామంలో 491 మంది ఓటర్లకు గాను 412 మంది వినియోగించుకోగా మండలంలోనే అత్యధికంగా 84 శాతం నమోదైంది. ఆలుగామ గ్రామంలో 1281 మంది ఓటర్లకు గాను 865 మంది ఓటర్లు ఓటు వేయగా 67.53 శాతం నమోదయింది. మండలంలో అత్యల్పంగా నమోదైంది.

**హాజీపూర్ మండలంలో 73.57 శాతం పోలింగ్**

హాజీపూర్, మే 14 : సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో హాజీపూర్ మండలంలో 73.57 శాతం పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 32 పోలింగ్ బూత్‌లుండగా అందులో 27,116 మంది ఓటర్లుండగా అందులో పురుషులు 13,343 మంది, మహిళలు 13,773 మంది ఉన్నారు. పురుషులు 10,054 మంది, మహిళలు 9895 మంది. మొత్తంగా 19,949 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పేర్కొన్నారు.

**బెల్లంపల్లి నియోజకవర్గంలో సోనాపూర్ ముందంజ..**

కాసిపేట, మే 14 : బెల్లంపల్లి నియోజకవర్గంలో అత్యధిక ఓటు హక్కు వినియోగించుకున్న వారిలో కాసిపేట మండలంలోని మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామమైన సోనాపూర్ మొదటి స్థానంలో నిలిచింది. సోనాపూర్‌లో 92.02 శాతం అత్యధిక పోలింగ్ శాతం నమోదైంది. సోనాపూర్ పోలింగ్ కేంద్రం 3లో 539 ఓటర్లకు గాను 496 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 268కు 247, స్త్రీలు 271కు 249 మంది ఓటు హక్కు వినియోగించుకొని నియోజకవర్గంలోనే ఎక్కువ శాతం పోలింగ్‌లో మొదటి స్థానంలో నిలిచారు. అతి స్వల్పంగా మైదాన ప్రాంతమైన బెల్లంపల్లిలోని 49 పోలింగ్ కేంద్రంలో కేవలం 48.30 శాతం పోలింగ్ నమోదైంది. పురుషులు 207కు 106, స్త్రీలు 205కు 93 మంది మాత్రమే తమ ఓటు హక్కు వినియోగించుకొని నియోజకవర్గంలో చివరి స్థానంలో నిలిచింది. పట్టణ మైదాన ప్రాంతాల ప్రజల కన్న తమ బాధ్యతను, తమ ఓటు హక్కును వినియోగించుకొని ఆదర్శంగా నిలిచిన మారుమూల గిరిజన గ్రామమైన సోనాపూర్ ఓటర్లను పలువురు అభినందిస్తున్నారు.

**నియోజకవర్గంలో 1,25,255 మంది ఓటేశారు..**

బెల్లంపల్లి, మే 14 : లోక్‌సభ ఎన్నికల్లో బెల్లంపల్లి నియోజకవర్గంలో 1,25,255 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పురుష ఓటర్లు 63,449 మంది, మహిళా ఓటర్లు 61,801 మంది, ఇతరులు ఇద్దరు ఓటు వేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాహుల్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 1,76,514 మంది ఓటర్లు ఉండగా, పురుష ఓటర్లు 87,283, మహిళా ఓటర్లు 89,219 మంది ఉన్నారు. మొత్తం 70.96 శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు.

## బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్‌కు సన్మానం



బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిల్ లాల్ ను సన్మానిస్తున్న ఏసీపీ రవికుమార్

బెల్లంపల్లిరూరల్, మే 14: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల విధుల్లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్‌కి వచ్చిన బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ డేవిడ్‌లాల్‌తో పాటు బీఎస్ఎఫ్ సిబ్బందిని మంగళవారం బెల్లంపల్లి ఏసీపీ ఏ రవికుమార్ శాలువా కప్పి, జ్ఞాపికను అందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఏసీపీ రవికుమార్ మాట్లాడుతూ బీఎస్ఎఫ్ జీ 160 బెటాలియన్ అధికారులు, సిబ్బంది క్రమశిక్షణ, నిబద్ధతతో విధులను సమర్థవంతంగా నిర్వహించారన్నారు. కమిషనరేట్ పరిధిలో పోలీసులకు సహకరిస్తూ ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ఓటర్లకు ఇబ్బంది కలగకుండా విధులను బాధ్యతగా నిర్వర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రూరల్ సీఐ సయ్యద్ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్ఐ జీ నరేశ్ పాల్గొన్నారు.

## ఛత్రపతి శంబాజీ మహారాజ్ జయంతి



ఛత్రపతి శంబాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆరె సంక్షేమ సంఘం నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, మే14 : కుమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ భవన్‌లో ఆరె సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఛత్రపతి శంబాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ తర్వాత ఆయన వారసుడైన ఛత్రపతి శంబాజీ మహారాజ్ మరాఠా సామ్రాజ్యాన్ని సుభిక్షంగా పాలించాడని, ఆయన పోరాటం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు దానపెల్లి దాదారాం, జిల్లా ఉపాధ్యక్షుడు కోలే బిక్కాజీ, డివిజన్ ప్రధాన కార్యదర్శి నాగపూర్ మారుతి, కోశాధికారి ఎలుములే దిలీప్, సహాయ కార్యదర్శి బోటుపల్లి ప్రశాంత్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు గేడేకర్ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు పిప్రే సాయి, నాయకులు నాగపూర్ మనోహర్, భీమనకార్ పోషన్న, కోలే బాలాజీ, ఝాడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై మురుగు నీరు

- రాకపోకలకు ఇబ్బందులు



లంబాడీతండాలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

భీమారం,మే 14 : భీమారంలోని లంబాడీ తండాలో మురుగునీరు రోడ్డు పైకి వచ్చి చేరడంతో దుర్వాసన వెదజల్లుతున్నది. దీంతో అంబేద్కర్ కాలనీ, ఎస్టీ కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. లంబాడీతండా, అంబేద్కర్ కాలనీ వాసులు ఈ రోడ్డు నుంచే బస్టాండ్ ప్రాంతానికి రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు, వాహనదారులు వాపోతున్నారు.

## చైతన్యపరిచారు..ఓటింగ్‌లో పాల్గొనేలా చేశారు

- ఎన్నికలను బహిష్కరించిన రాజారం గ్రామంలో 78 శాతం పోలింగ్
- ఫలించిన అధికారుల కృషి
- సమస్యలు పరిష్కరించకపోతే స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని స్పష్టం చేసిన గ్రామస్తులు



ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో నిల్చున్న రాజారం గ్రామస్తులు

కోటపల్లి, మే 14 : గ్రామానికి ప్రధాన సమస్య అయిన రోడ్డు నిర్మించే వరకూ ఎన్నికలకు దూరంగా ఉంటామని పార్లమెంట్ ఎన్నికల బహిష్కరణకు పిలుపునిచ్చిన కోటపల్లి మండలంలో రాజారం గ్రామస్తులు సోమవారం జరిగిన ఎన్నికల్లో పాల్గొన్నారు. వారిని సముదాయించడంలో అధికారుల కృషి ఫలించింది. గ్రామంలో మొత్తం 868 మంది ఓటర్లు ఉండగా 674 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 78 శాతం పోలింగ్ నమోదయింది. వర్షకాలం వచ్చిందంటే చాలు రాజారం గ్రామానికి రోడ్డు లేక విద్యార్థులు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రతి రోజూ ఇబ్బంది పడాల్సిందే. వారి కష్టాలను బాహ్య ప్రపంచానికి తెలిపేందుకు పార్లమెంట్ ఎన్నికలను వేదికగా చేసుకోవాలని అనుకున్నారు. గ్రామస్తులంతా ఏకమై ఎన్నికలను బహిష్కరిస్తూ తీర్మానించారు. ఈ విషయం తెలుసుకున్న మండల అధికారులు గ్రామంలో పర్యటించి రెండుసార్లు సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించినా వినలేదు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న జిల్లా యంత్రాంగం,



ఓటర్ స్లిప్‌లను పంచుతున్న అధికారులు

అదనపు కలెక్టర్ మోతీలాల్, ఏసీపీ వెంకటేశ్వర్‌తో గ్రామస్తులతో సమావేశం ఏర్పాటు చేయించి మాట్లాడారు. దీనికి తోడు గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి సైతం గ్రామస్తులతో మాట్లాడి ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అప్పటివరకు ఓటింగ్‌కు దూరం ఉంటామని చెప్పిన గ్రామస్తులు అధికారుల మాటలతో పోలింగ్ బహిష్కరణ నిర్ణయాన్ని వాయిదా వేసి ఓటేశారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ సారి స్థానిక సంస్థల ఎన్నికలకు దూరంగా ఉంటామని గ్రామస్తులు స్పష్టం చేశారు.

## ఆత్రం సక్కు గెలుపు ఖాయం

తాంసి(తలమడుగు), మే 14 : ఆదిలాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు గెలుపు ఖాయమైందని బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ అన్నారు. మండలంలో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఈ బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేతృత్వంలో మండలంలో ముమ్మరంగా ప్రచారం చేశామని, బీఆర్ఎస్ ప్రభుత్వ పథకాలకు ప్రజల నుంచి భారీ స్పందన వచ్చిందన్నారు. మరోవైపు సోషల్ మీడియాలో ఫేక్ సర్వేలు చక్కర్లు కొడుతున్నాయన్నారు.

## గోదావరి నదిపై వంతెన నిర్మించాలి

- రోడ్లు, భవనాల శాఖ అధికారికి వంతెన సాధన సమితి నాయకుల వినతి



ఆర్ అండ్ బీ చీఫ్ ఇంజినీర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మధుసూదన్ రావు, నాయకులు

హాజీపూర్, మే 14 : మంచిర్యాల కాలేజీ రోడ్డు గోదావరి నది పై మంచిర్యాల-అంతర్గాంను కలుపుతూ నిర్మించే వంతెన పనులను చేపట్టాలని కోరుతూ వంతెన సాధన సమితి నాయకులు మధుసూదన్‌రావు మంగళవారం రోడ్లు, భవనాల శాఖ అధికారికి వినతి పత్రం అందజేశారు. గోదావరి నదిని పరిశీలించేందుకు వచ్చిన సందర్భంగా వినతి పత్రం అందజేసి మాట్లాడారు. గోదావరి నది పై వంతెన ఏర్పాటు చేసేందుకు దశాబ్దాల నుంచి పోరాట చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎట్టకేలకు గోదావరి నదిపై వంతెన నిర్మించాలని నిధులను సైతం మంజూరు చేసిందన్నారు. వంతెన నిర్మాణ పనులను ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఈ వంతెన నిర్మాణంపై తప్పుడు సమాచారంతో పనులను నిలిపి వేసి వేరే ప్రాంతానికి తరలించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేక జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తా నుంచి మంచిర్యాల శివారులోని శ్రీనివాస గార్డెన్ వరకు జాతీయ రహదారి విస్తరణ పనుల కోసం రూ.18 కోట్లను కేటాయించి టెండర్లను పిలిచి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకొని ఐదు నెలలైనా పనులు ప్రారంభించలేదన్నారు. సిర్పూర్ ప్రాంతంలో వార్ధా నదిపై నిర్మిస్తున్న వంతెన పనులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో గత ప్రభుత్వం మంజూరు చేసిన వంతెన నిర్మాణ పనుల కొనసాగింపుపై లోపాలు, సర్వే పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఆరోపించారు. వంతెన నిర్మాణంతో పాటు మరో రూ.20 కోట్లను అదనంగా కేటాయించినట్లయితే 200 ఫీట్ల మున్సిపల్ రోడ్డు, కాలేజ్ రోడ్డు అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ ఐలాండ్ ఏర్పాటు చేస్తే పట్టణం మరింత సుందరంగా, ప్రజలు, వ్యాపారులకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో గోదావరి సాధన సమితి నాయకులు కనుకుంట్ల మల్లయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు బోస్, సత్యనారాయణ, సూర్యనారాయణ, అడెపు రాజాబాబు, యాదగిరి, తిరుపతి, రాజలింగు, మహేశ్, శివ, దాస్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి

### నారాయణఖేడ్

## ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి

- ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం దారుణం
- టీఎస్‌యూటీఎఫ్ నాయకుల డిమాండ్

ఆసిఫాబాద్ టౌన్, మే 14 : ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడం దారుణమని, ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతకుమారి తెలిపారు. ఎండ తీవ్రత తాళలేక నలుగురు సిబ్బంది మరణించిన సందర్భంలో కూడా ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించామన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా రావాల్సిన అలవెన్స్‌లు అడిగితే లాఠీచార్జి చేయించడం సమంజసం కాదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీవో, ఏపీవోలకు రోజుకు రూ.600, ఓపీవోలకు రూ.400 రాష్ట్ర ప్రభుత్వం జీవో నం. 61 ని ఈ నెల 11 న విడుదల చేసింది. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీవో, ఏపీవోలకు రూ 3150 లు చెల్లించారు. కానీ నారాయణఖేడ్‌లో 2400 మాత్రమే ఇచ్చారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించిన టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టీ లక్ష్మిరెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీవో, పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, తదితరులు ఉన్నారు.

## అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న యువకులు

రెబ్బెన, మే 14: రెబ్బెన మండలం ఇందిరనగర్ బస్టాండ్ వద్ద, కనకదుర్గాదేవి స్వయంభూ మహంకాళి ఆలయం వద్ద అంబలి పంపిణీ చేసినట్లు దేవర వినోద్ పేర్కొన్నారు. మండుతున్న ఎండల దృష్ట్యా అంబలి పంపిణీ చేసినట్లు తెలిపారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెంచికల్ పేట, మే 14 : మండల కేంద్రంలోని ఎల్కపల్లి అభయాంజనేయ స్వామి మూడవ వార్షికోత్సవ సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం, అలంకరణ, అనంతరం హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాలకుర్తి విష్ణుతేజ ఆచార్యులు ఆలయకమిటీ సభ్యులు చౌదరి తిరుపతి, తెలిగె సత్యనారాయణ, చంద్ర శేఖర్, రమేశ్, సదాశివ్, మహిళలు పాల్గొన్నారు.

## రాధాకృష్ణ మందిరంలో ప్రత్యేక పూజలు

చింతలమానేపల్లి, మే 14 : మండలంలోని కర్జెల్లి గ్రామంలో ఉన్న ఓంకార ఆశ్రమ రాధాకృష్ణ మందిరంలో భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. కరీంనగర్‌కు చెందిన వేద పండితులు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు, మహాలక్ష్మి సహిత గీత యజ్ఞం, దస్నాపూర్ నారాయణంగిరి స్వామి, శివ రామ కృష్ణ బృందావనం ఆధ్వర్యంలో ఓంకార ఆశ్రమంలో రాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. 41 రోజుల తర్వాత నిర్వహించే మండల పూజా కార్యక్రమం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రుద్రాపూర్, బాలాజీ అనుకోడ, బాబాసాగర్, బారెగూడ, ముంజంపల్లి, చింతలమానేపల్లి, గంగాపూర్, తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సీఎంను కలిసిన నాయకులు



ఉపముఖ్యమంత్రిని సన్మానిస్తున్న నాయకులు

దండేపల్లి, మే14: మంథని నియోజకవర్గంలోని ధన్వాడ గ్రామంలో మంత్రి శ్రీధర్‌బాబు నివాసంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుతో కలిసి కాంగ్రెస్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎంను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, నాయకులు గడ్డం త్రిమూర్తి, వెంగళరావు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్ టౌన్, మే14 : కార్పొరేట్ కళాశాలలో ఇంటర్, ఎంసెట్ కోచింగ్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జీ సజీవన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. 2024-2025 సంవత్సరానికి గాను రాష్ట్రంలోని కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 10వ తరగతిలో 7.0 జీపీఏ మార్కులు, అంతకన్న ఎక్కువ వచ్చిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 30 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, పూర్తి వివరాలకు www.telanganaepass.cgg.gov.inలో తెలుసుకోవచ్చని తెలిపారు.

## సీనియర్ సిటిజన్లకు అభినందనలు

కాగజ్‌నగర్, మే 14: పార్లమెంట్ ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకున్న సీనియర్ సిటిజన్లకు సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ మంగళవారం అభినందనలు తెలిపారు. ఓటు వేసి బాధ్యతను చాటిచెప్పినందుకు కృతజ్ఞతలు చెప్పారు.